క్లుప్తంగా

సీజేఎఫ్ఎస్ భూములను పేదలకు ఇవ్వాలి



భూములు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న సుందరాంగిణిపల్లె వాసులు

వెదురుకుప్పం: భూమి లేని నిరుపేదలకు సీఎఫ్ఎస్ భూములను పంచాలని మండలంలోని సుందరాంగిణిపల్లె దళితవాడకు చెందిన పేదలు శనివారం డిమాండ్ చేశారు. దేవరగుడిపల్లె సమీపంలో ఉన్న సీజేఎఫ్ఎస్ భూముల్లో పేదలకు ఇవ్వాలని కోరారు. గతంలో ఎన్నో సార్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చినా ప్రయోజనం లేకపోయిందన్నారు. ఇప్పుడైనా అధికారులు స్పందించి భూమి లేని పేదలను గుర్తించి భూమి హక్కు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. భూములు ఉన్నవారికే రెవెన్యూ అధికారులు వత్తాసు పలుకుతూ పేదలకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. సీజేఎఫ్ఎస్ భూములను సర్వే చేసి నిరుపేదలకు ఇవ్వాలని కోరారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత



బాధిత కుటుంబసభ్యులకు బీమా సాయం అందిస్తున్న సర్పంచ్ భాస్కర్‌రెడ్డి

పాలసముద్రం: మఠవలం గ్రామంలో సహజ మరణం చెందిన సీవీ గుణశేఖర్ కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద శనివారం సర్పంచ్ భాస్కర్‌రెడ్డి రూ.10 వేలు నగదు అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మండలంలోని శ్రీకావేరిరాజుపురం గ్రామ సచివాలయ పరిధిలోని మఠవలం గ్రామంలో సీవీ గుణశేఖర్ సహజ మరణం చెందడంతో అతని కుటుంబసభ్యులకు వైఎస్సార్ బీమా పథకం కింద రూ.లక్ష వర్తిస్తుందన్నారు. ప్రస్తుతం అంత్యక్రియల కోసం కుటుంబసభ్యులకు రూ.10 వేలు నగదు అందించామని తెలిపారు. మిగతా రూ.90 వేలు త్వరలోనే నామినీ వ్యక్తిగత ఖాతాల్లో జమ అవుతుందన్నారు.

బైక్‌ను క్రేన్ ఢీ: వ్యక్తి మృతి

రేణిగుంట: రేణిగుంట–పుత్తూరు మార్గం కేఎల్ఎం ఆస్పత్రి కూడలి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందినట్లు గాజులమండ్యం ఎస్ఐ ధర్మారెడ్డి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు... ఏర్పేడు మండలం, రావిళ్లవారి కండ్రిగ గ్రామానికి చెందిన కె.నారాయణ(44), భార్య పుష్పలత(38) కలిసి ద్విచక్ర వాహనంలో వెళ్తున్నారు. జీవాగ్రం సమీపంలో వెనుక నుంచి క్రేన్ ఢీకొనడంతో నారాయణ కింద పడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. వెనుక కూర్చున్న భార్య పుష్పలత కాలుకు రక్తగాయమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతునికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. కళ్లెదుటే భర్త మృతి చెందడంతో భార్య పుష్పలత విలవిల్లాడిపోయారు. గుండెలు బాదుకుంటూ బోరున విలపించడం చూపరులను కలచివేసింది.

పోలీసుశాఖలో బదిలీలు

చిత్తూరు అర్బన్: చిత్తూరు పోలీసు శాఖలో పని చేస్తున్న పలువురిని బదిలీ చేస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు వీఆర్‌లో ఉన్న కృష్ణమోహన్‌ను పలమనేరు రూరల్ సీఐగా, ఇక్కడ పనిచేస్తున్న అశోక్‌కుమార్‌ను చిత్తూరు వీఆర్‌కు బదిలీ చేశారు. చిత్తూరు వీఆర్‌లో ఉన్న ఏ హరిప్రసాద్‌ను శ్రీసిటీ ఎస్ఐగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

చిత్తూరులో కిడ్నాప్ కేసు నమోదు

చిత్తూరు అర్బన్: చిత్తూర్ నగరంలో వాజిద్ అనే యువకుడు కిడ్నాప్ ఘటనలో వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సత్యనారాయణపురానికి చెందిన శివ బార్బర్ షాపులు నిర్వహిస్తున్నాడు. ఇతను వద్ద పని చేసే ఉత్తరప్రదేశ్‌కు చెందిన వాజీద్ మరో దుకాణంలో పని చేయడాన్ని జీర్ణించుకోలేక పోయాడు. ఈక్రమంలో శుక్రవారం వాజీద్‌ను శివ కిడ్నాప్ చేసి రేణిగుంట సమీపం తీసుకెళ్లి చంపాలని ప్రయత్నించాడు. స్థానికులు గుర్తించడంతో చావబాది పారిపోయాడు. స్థానికులు వాజీద్‌ను తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అనంతరం చిత్తూరు నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి బంధువులు చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న శివ కోసం గాలిస్తున్నట్లు వన్ టౌన్ సీఐ విశ్వనాథరెడ్డి తెలిపారు.

తొలిరోజు 50 అడ్మిషన్లు

తిరుపతి సిటీ: ఎస్వీయూ పీజీ సెట్–2023లో సీట్లు సాధించిన విద్యార్థులు తొలి రోజు 50 మంది పలు కోర్సులలో అడ్మిషన్లు పొందినట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ శ్రీమురళి శనివారం తెలిపారు. ఈ నెల 10వ తేదీ వరకు ధ్రువపత్రాల తనిఖీ, అడ్మిషన్లు కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు.

కనిపించే దేవుళ్లు.. డాక్టర్లు

- విద్య, వైద్యానికి జగనన్న ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది
- దేశంలోని రాష్ట్రాలన్నీ మన వైపే చూస్తున్నాయి
- జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం: ప్రాణాలను కాపాడే వైద్యులను రోగులు దేవుళ్లుగా భావిస్తారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. శనివారం మండల పరిధిలోని ఆర్కేవీబీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంపీపీ లత, సర్పంచ్ దివ్య, జిల్లా డీఐఓ డాక్టర్ రవిరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులు, దేవుళ్ల కన్నా రోగులు వైద్యులనే దేవుళ్లుగా భావిస్తారని గుర్తు చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందిస్తే, ఆయన తనయుడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యానికి పెద్దపీట వేసి జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా పల్లెలను వైద్యసిబ్బంది జల్లెడ పడుతున్నారన్నారు. లేనివాడికి సేవే ముఖ్యం, ఎంతమంది పీఎంలు, సీఎంలు వచ్చారని, అయితే పేదవాడి అభివృద్ధికి విద్య, వైద్యం అవసరమని గుర్తించిన సీఎం జగనన్నకు తలవంచి నమస్కరిస్తున్నారని అన్నారు. దైవ స్వరూపులైన వైద్యులు మంచానికే పరిమితమైన రోగులకు సదరన్ సర్టిఫికెట్లు మంజూరు చేసి రూ.3 వేల నుంచి రూ.5 వేలు అందించడానికి సహకరించాలని తెలిపారు. పక్షవాతం, పుట్టుకతో నడవలేక తల్లిదండ్రులపైనే ఆధారపడి జీవించే వారికి సదరన్ సర్టిఫికెట్లు మంజూరు చేసి ఇతరులకు భారం కాకుండా ప్రభుత్వ పథకాలను అందేవిధంగా చూడాలని కోరారు. అయితే కొందరు మంచానికే పరిమితమైనట్లు చూపించి, రూ.5 వేలు పింఛన్ తీసుకోవడంతో పాటు కార్లలో తిరుగుతున్నట్లు సమాచారం అందిందన్నారు. అదే నిజమైన పేదలకు ఎందుకు న్యాయం చేయలేకపోతున్నారని, అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. సీఎం జగనన్న ఎంత సీరియస్‌గా చెప్పినా అధికారులు ఎందుకు పని చేయడం లేదని ప్రశ్నించారు. ఇలాగైతే ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తానని, మనసు ఉంటే మార్గం ఉంటుందని సూచించారు. పేదవాడు ఓటు వేస్తేనే ఎమ్మెల్యే అయ్యాను ? సీఎం జగనన్న కరుణిస్తే డిప్యూటీ సీఎం అయ్యాను ? పేదవాడి బాధ తనకు బాగా తెలుసన్నారు. ప్రతి పేదవాడి బిడ్డ డాక్టర్లు, కలెక్టర్లు, ఐపీఎస్, ఐఏఎస్‌లు, పెద్ద బిజినెస్‌మేన్లు కావాలన్నదే సీఎం జగనన్న లక్ష్యమన్నారు. ఆ లక్ష్యాన్ని ఛేదించినప్పుడే ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా రోగులకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నారని తెలిపారు. దీంతో దేశంలోనే అన్ని రాష్ట్రాలు మన రాష్ట్రం వైపే చూస్తున్నాయని గుర్తు చేశారు.

జగనన్న సీఎంగా ఉండడం అదృష్టం..

ఉన్నత కుటుంబంలో పుట్టినా పేదవాడి బాధలు తెలిసిన జగనన్న మన ముఖ్యమంత్రిగా ఉండడం అదృష్టంగా భావించాలన్నారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను ఉప ముఖ్యమంత్రి పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి విజయేంద్రరావు, డాక్టర్ వెంగమ్మ, డాక్టర్ వెంకటరామిరెడ్డి, డాక్టర్ శ్రావణ్, డాక్టర్ తేజ, డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ప్రభావతి, అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ప్రసాద్, డాక్టర్ శృతి, డాక్టర్ సత్యవాణి, డాక్టర్ భాగ్యలక్ష్మి, డాక్టర్ గోపినాథ్ పాల్గొన్నారు.

కిక్కిరిసిన ఆలయాలు



ఆలయంలో బారులు తీరిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి భూదేవి సమేత కరియమాణిక్య స్వామి

నగరి: పెరటాశి నెల మూడవవారం కావడంతో వేంకటేశ్వర స్వామి ఆలయాలు కిక్కిరిశాయి. పట్టణ పరిధిలో పూజాసామగ్రి విక్రయాలకు ప్రత్యేక దుకాణాలు ఏర్పాటు చేశారు. టీటీడీ ఆధీనంలో ఉన్న నగరి పట్టణంలోని శ్రీదేవి భూదేవి సమేత కరియమాణిక్య స్వామి ఆలయం, సత్రవాడలోని కరివరదరాజ స్వామి ఆలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులు వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు టీటీడీ వారితో పాటు భక్తులు కూడా ప్రసాదాలు అందజేశారు.

ఐకమత్య పోరాటాలు అవసరం



మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి ప్రసాద్

పుత్తూరు రూరల్: ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడానికి ఐక్యమత్య పోరాటాలు అవసరమని ఎల్ఐసీ నెల్లూరు డివిజన్ ప్రధాన కార్యదర్శి డి.ప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక బ్రాంచి కార్యాలయంలో ఎల్ఐసీ యూనియన్ 31వ వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేడు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల ప్రభుత్వ రంగ సంస్థలు గడ్డు రోజులను ఎదుర్కొంటున్నాయని చెప్పారు. సమస్యల పరిష్కారానికి అన్ని ప్రభుత్వ రంగ సంస్థలు కలిసిరావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పుత్తూరు బ్రాంచ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డి.దస్తగిరి, కార్యదర్శిగా ఎన్.లక్ష్మణకుమార్, ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా వేలాయుధం, కోశాధికారిగా షణ్ముగం, కార్యవర్గ సభ్యులుగా రమేష్, రామకృష్ణ, మహావాణి ఎన్నుకున్నారు.

అఖండ పారాయణం రేపు

తిరుమల: లోక కల్యాణార్థం శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమలలోని నాదనీరాజనం వేదికపై సోమవారం నాలుగో విడత అయోధ్యకాండ అఖండ పారాయణం జరుగనుంది. ఈ కార్యక్రమాన్ని ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం చేయనుంది. అయోధ్యకాండలోని 12, 13వ సర్గల్లోని 142 శ్లోకాలు, యోగవాశిష్ఠం, ధన్వంతరి మహామంత్రంలోని 25 శ్లోకాలు మొత్తం 167 శ్లోకాలను పారాయణం చేస్తారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



మహేశ్వర్‌రెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు



రామకృష్ణ మిషన్ పీఠాధిపతి సుహితానంద జీ మహరాజ్‌కు జ్ఞాపిక అందిస్తున్న ఆలయ చైర్మన్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం పలువురు ప్రముఖులు వేర్వేరుగా దర్శించుకున్నారు. ఇందులో కలకత్తా శ్రీరామకృష్ణమిషన్ పీఠాధిపతి సుహితానంద జీ మహరాజ్, ఆయన శిష్యబృందం, మహానంది ఆలయ ధర్మకర్తమండలి చైర్మన్ కే.మహేశ్వర్‌రెడ్డి కుటుంబ సమేతంగా విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయదక్షిణ గోపురం వద్ద పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. పాలకమండలి సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

వినాయకునికి సాంస్కృతిక నీరాజనం





నాటికలోని ఓ సన్నివేశం, పాటలను ఆలపిస్తున్న గాయకులు



నాటికను ప్రదర్శిస్తున్న కళాకారులు



నాట్యం చేస్తున్న కళాకారిణి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వార్షిక ప్రత్యేక ఉత్సవాల్లో స్వామివారి ఆస్థాన మండపంలో కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక నీరాజనాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కళాకారుల నాట్య ప్రదర్శనలు, నృత్యాలు, ఆలపించిన భక్తి గీతాలు, నాటికలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కళాకారులకు ఆలయ అధికారులు ప్రశంసా పత్రాలు, స్వామివారి ప్రసాదాలు అందించారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు



రోగులతో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతి



కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ శోభ, అన్బళగన్

శ్రీరంగరాజపురం: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తోందని మండలంలోని వి.పురం గ్రామ సచివాలయ పరిధిలోని గంగమ్మ గుడి జెడ్పీ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును చిత్తూరు డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతి పరిశీలించారు. ఈసందర్భంగా వైద్య శిబిరానికి వచ్చిన రోగులతో మాట్లాడుతూ వైద్యసేవలపై వాకబు చేశారు. మెరుగైన చికిత్స, మందుల పంపిణీ, వసతులపై ఆరా తీశారు. శిబిరంలో నిర్వహించిన స్టాళ్లను సందర్శించారు. శిబిరానికి 560 మంది రోగులు రావడంతో అందరికీ పరీక్షలు నిర్వహించి వైద్యసేవలు అందజేశారు. ఇందులో 130 మంది రోగులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మమ్మ, జెడ్పీటీసీ రమణప్రసాద్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మణి, మాజీ సర్పంచ్ ప్రసాద్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి ప్రసాద్‌రెడ్డి, ఎంపీడీఓ కృష్ణయ్య, తహసీల్దార్ లోకనాథ్‌పిళ్ళై, వైద్యాధికారులు లక్ష్మీనారాయణ, మహమ్మద్, బాలసుబ్రమణ్యం, పల్లవి, గౌరి పాల్గొన్నారు.



వెదురుకుప్పం: పాతగుంటలో

పాలసముద్రంలో..

పాలసముద్రం: రాష్ట్ర ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టిందని జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, ఎంపీటీసీ లిఖిత అన్నారు. శనివారం బాలకృష్ణాపురం సచివాలయ ఆవరణలో సర్పంచ్ శోభ, పుత్తూరు కేశవరెడ్డి సమక్షంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్ కుమార్ మాట్లాడుతూ ఇంటింటా సర్వే చేసి మొత్తం 225 మందికి టోకెన్లు పంపిణీ చేశారు. శిబిరంలో 225 మంది వైద్యపరీక్షలు చేసుకుని ఉచితంగా మందులు తీసుకెళ్లారు. కంటి పరీక్షలు చేసి వారికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాబు, వైద్యాధికారి మోహన్‌కృష్ణ, మండల విస్తరణాధికారి రమేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ సుశీల, మురళి, సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: పేదలకు జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు ఎంపీడీఓ సుధాకరరావు అన్నారు. శనివారం మండలంలోని పాతగుంటలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ సుధాకరరావు మాట్లాడుతూ ప్రజలను సంపూర్ణ ఆరోగ్యవంతులు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పాతగుంటలో 560 మంది రోగులకు వైద్యసేవలు అందించినట్లు తెలిపారు. పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ, డీటీ కోమల, ఈఓపీఆర్డీ పురుషోత్తం, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ బట్టే సుబ్రమణ్యం, మాజీ సర్పంచ్ గోవిందన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ బొజ్జారెడ్డి, ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

విజన్ ఉన్న నాయకుడు జగనన్న



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కళ్ల అద్దాలు అందిస్తున్న మంత్రి ఆర్‌కే రోజా



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి రోజా

విజయపురం (నగరి): పేదల కోసం జగనన్న రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజ్ నిర్మిస్తున్నారని మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. శనివారం పన్నూరులో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మంత్రి రోజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో జగనన్న విజన్ ఉన్న నాయకుడని, అందుకే రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలు నిర్మిస్తున్నారని చెప్పారు. ఇప్పటికే ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌ఓలు ప్రతి ఇంటికీ వచ్చి వైద్యసేవలు అందిస్తున్నారని తెలిపారు. ప్రజలు బాగుండాలనే ఉద్దేశంతో సంక్షేమ పథకాలు అందిస్తున్న జగనన్న మీరు ఆదరించి మరోసారి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాలాజీ , జెడ్పీటీసీ రేవతి, ఎంపీడీఓ చంద్రమౌళి, తహసీల్దార్ వెంకట్రాయులు, డాక్టర్ సోమశేఖర్, కన్వీనర్ గోపి, ఆర్బీకే చైర్మన్ గుణశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ రాజగోపాల్, ఎంపీటీసీ గోవిందమ్మ, సర్పంచ్ సునందన, కుమార్, కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

‘ప్రజలు కోసమే జగన్ సీఎం కావాలి’



మాట్లాడుతున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

పుత్తూరు రూరల్: ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి? అంటే సంక్షేమం, అభివృద్ధి కోసమని ప్రతి పేదవాడు ఎలుగెత్తి చెబుతున్నాడని పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా సోదరుడు, వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఓ ప్రైవేటు కళ్యాణ మండపంలో ‘ఏపీకి జగనే ఎందుకు కావాలి’ అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్‌ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ నేడు రాష్ట్ర ప్రజలంతా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో ఎంతో సంతోషంగా ఉన్నారని చెప్పారు. ఈ సంతోషం ఇలాగే కొనసాగాలంటే ఏపీకి జగనన్న మళ్లీ సీఎం కావాల్సిందేనని తేల్చి చెప్పారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ మోసపూరిత వాగ్దానాలను గుప్పిస్తోందని చెప్పారు. ఇందుకు పచ్చమీడియా పనిగట్టుకుని ప్రచారం నిర్వహిస్తోందన్నారు. గతంలో తాము చేసిన మంచిని చెప్పి ఓట్లు అడిగే స్థితిలో టీడీపీ లేదని, అందుకే అసత్య ప్రచారాలతో ప్రజల ముందుకు వస్తోందని ఆరోపించారు. వీటిని వైఎస్సార్‌సీపీ శ్రేణులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అదే సమయంలో జగనన్న ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. ఇందుకు ప్రతి కార్యకర్త, నాయకుడు తమవంతు పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఏ.హరి, వైస్ చైర్మన్లు డి.శంకర్, డి.జయప్రకాష్, ఎంఎల్‌ఓ దిలీప్‌మొదలి, వైస్ ఎంపీపీ మునస్వామిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు గోవిందస్వామిరెడ్డి, సింగిల్‌విండో ప్రెసిడెంట్ శ్రీనివాసులురెడ్డి, ఆలయాల చైర్మన్లు లారీమోహన్, మనోహర్‌రెడ్డి, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, గృహసారథులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ఎన్‌సీసీ విద్యార్థి ఇలంగోవన్‌కు సత్కారం



ఇలంగోవన్‌ను సత్కరిస్తున్న అధ్యాపక బృందం

పుత్తూరు రూరల్: భారత సాయుధ దళాలకు చెందిన నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) విభాగంలో పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ విద్యార్థి ఆర్.ఎస్.ఇలంగోవన్ ఉత్తమ ప్రతిభ చూపి రజత పతకం అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ జి.శ్రీనివాసులురెడ్డి తెలిపారు. శనివారం కళాశాలలో ఇలంగోవన్‌కు అభినందన సభ నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ కళాశాలలో బీకాం తృతీయ ఏడాది చదువుతున్న ఇలంగోవన్ అఖిల భారత తలసైనిక క్యాంపు శిక్షణకు ఎంపిక కావడం, అక్కడ అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడం కళాశాలకు గర్వకారణమన్నారు. ఎన్‌సీసీలో నాయకత్వ లక్షణాలు, మంచి క్రమశిక్షణ అలవడుతాయని తెలిపారు. అనంతరం అధ్యాక బృందం ఇలంగోవన్, అతని తండ్రి శేఖర్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వీరయ్య, ఎన్‌సీసీ అధికారి శ్రీనివాసులు, అధ్యాపకులు దేవకి, వాసవి, గంగయ్య, తిరుమలయ్య, ఎన్‌సీసీ కేడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో విభిన్న కళారూపాలు

తిరుపతి కల్చరల్: ఈనెల 15 నుంచి 23 వరకు జరగనున్న శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో వాహన సేవల్లో విభిన్న కళారూపాలు ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేయాలని టీటీడీ జేఈవో సదా భార్గవి అధికారులను ఆదేశించారు. ఆమె శనివారం అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో కళా ప్రదర్శనలకు మంచి స్పందన లభించిందని, నవరాత్రి బ్రహ్మోత్సవాల్లోనూ మరిన్ని ప్రదర్శనలు ఏర్పాటు చేయాలన్నారు. దక్షిణాది రాష్ట్రాలతో పాటు ఒడిశా, మధ్యప్రదేశ్, పంజాబ్, గుజరాత్, జమ్మూకాశ్మీర్, ఉత్తరప్రదేశ్, మిజోరం, మణిపూర్ రాష్ట్రాల నుంచి కళాబృందాలు వస్తున్నట్లు జేఈవో తెలిపారు. కార్యక్రమంలో టీటీడీ సీఏవో శేషశైలేంద్ర, ఎస్వీబీసీ సీఈవో షణ్ముఖ్ కుమార్, ధార్మిక ప్రాజెక్టుల ప్రోగ్రామ్ ఆఫీసర్ రాజగోపాల్, హిందూ ధర్మప్రచార పరిషత్ కార్యదర్శి శ్రీనివాసులు, దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి ఆనందతీర్థాచార్యులు, అన్నమయ్య ప్రాజెక్టు సంచాలకుడు డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ, ట్రాన్స్ పోర్టు జీఎం శేషారెడ్డి పాల్గొన్నారు.

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న విహారం



తిరుచ్చిపై భక్తులను దర్శనమిస్తున్న స్వామి, అమ్మవార్లు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వెంకటేశ్వర స్వామి శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం కల్యాణ మండపంలో ఉత్సవర్లకు కల్యాణం చేపట్టారు. సాయంత్రం ఆలయ ఆవరణలో ఊంజల్ సేవ చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లు తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. పెరటాసి మూడో శనివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ పాల్గొన్నారు.



పోటెత్తిన భక్తులు

నాగలాపురం : మండల కేంద్రమైన నాగలాపురంలో ఉన్న టీటీడీ అనుబంధ వేదవల్లి సమేత వేదనారాయణ స్వామి ఆలయంలో పెరటాసి మూడో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం ఉత్సవమూర్తులను అలంకరించి ఊంజల్ సేవ చేపట్టారు.